





RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 290 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | 07-02-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


## మూడు నెలల్లో కొత్త రాజకీయ పార్టీ

- ముహూర్తం కోసం ఎదురుచూస్తున్న
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత




హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మరో మూడు నెలల్లో కొత్త రాజకీయ పార్టీని ప్రకటించనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వెల్లడించారు. తన రాజకీయ భవిష్యత్తుకు సంబంధించిన కీలక నిర్ణయాన్ని సరైన సమయంలో తీసుకుంటానని చెప్పారు. తనకు సెంటిమెంట్ ఎక్కువన్న ఆమె.. మంచి మూహూర్తం కోసం ఎదురు చూస్తున్నానని తెలిపారు. కొంత కాలం గడిచిన తర్వాత తన బలం ఏంటో అందరికీ అర్థమవుతుందని కవిత

-మిగతా 2 లో

## నిజామాబాద్ రైతుల పోరాటం దేశానికే ఆదర్శం

**బీజేపీ, బీఆర్ఎస్‌లను నమ్ముకుంటే నట్టేట ముంచుతారు**

### ధర్మపురి అర్వింద్‌తో జిల్లాకు ఒరిగింది శూన్యం



- కేసీఆర్‌కు దత్తపుత్రుడిగా మారిన కిషన్ రెడ్డి
- అందుకే కేసీఆర్, కేటీఆర్‌లను కాపడుతున్నాడు
- కాళేశ్వరంపై సిబిఐ విచారణకు ఆదేశించినా పట్టించుకోని కేంద్రం
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యం
- నిజామాబాద్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి

నిజామాబాద్, ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నిజామాబాద్ రైతుల పోరాటం దేశానికే ఆదర్శమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్‌లోని వ్యవసాయం తెలంగాణకే కాదు, దేశానికే ఆదర్శమన్నారు. నిజామాబాద్ జిల్లాలోని ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు అదనపు నిధులు ఇవ్వడానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. నిజామాబాద్ జిల్లా బర్దిపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ సూచనలతో ఈ జిల్లాలో అభివృద్ధి పనులు చేస్తున్నాం. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయబోతున్నాం.

-మిగతా 2 లో

## మెరిసిన యంగ్ ఇండియా

- ఫైనల్లో భారత్ చేతిలో ఇంగ్లండ్ చిత్తు!
- భారీ శతకంతో వైభవ్ విధ్వంసం..
- ఇంగ్లాండ్ జట్టు భారత్ బౌలర్ల ధాటికి 40.1 ఓవర్లకే కుప్పకూలింది
- 101పరుగుల తేడాతో అద్భుతమైన విజయం
- సీఎం ఫాల్కన్ చేసిన సెంచరీ వృథా

న్యూఢిల్లీ

అండర్-19లో వరల్డ్ కప్‌లో యంగ్ ఇండియా గ్రాండ్ విక్టరీ సాధించింది. 101పరుగుల తేడాతో అద్భుతమైన విజయాన్ని సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ దిగిన ఇండియా 50ఓవర్లకు గాను 9 వికెట్లు కోల్పోయి 411 పరుగులు చేసింది. ఆ తర్వాత ఛేదనకు దిగిన ఇంగ్లాండ్ జట్టు భారత్ బౌలర్ల ధాటికి 40.1 ఓవర్లకే కుప్పకూలింది. 10 వికెట్లు కోల్పోయి 311 రన్స్ చేసి భారత్ నిర్దేశించిన కొండంత లక్ష్యాన్ని చేధించలేకపోయింది. సీఎం ఫాల్కన్ చేసిన సెంచరీ వృథా అయిపోయింది. భారత్ బౌలర్లు అభిరీష్ 3, దీపేష్,చౌహన్ 2, కిలాన్ పటేల్,మాత్రే తలో వికెట్లు తీశారు. గ్రూప్‌లో దశలో అన్ని మ్యాచ్‌ల్లో విజయం సాధించిన ఇండియా టీం...శుక్రవారం జింబాబ్వేలోని హరారే వేదికగా జరిగిన ఫైనల్ ఫైట్‌లో కూడా అదే జోరును కొనసాగించింది.





-మిగతా 2 లో

## గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్..

### ముగ్గురు మావోయిస్టులు, ఒక కమాండో మృతి

న్యూఢిల్లీ ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): : మహారాష్ట్ర లోని గడ్చిరోలి లో మరో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. నిన్న (గురువారం) ఉదయం నుంచి భద్రతాబలగాలు, మావోయిస్టుల (మీుశీఱర్ం) మధ్య జరుగుతున్న ఎదురుకాల్పుల్లో ఒక కమాండో కూడా ప్రాణాలు కోల్పోయారు. మరో పోలీస్ అధికారి తీవ్రంగా గాయపడ్డారు.



-మిగతా 2 లో



## ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడి..

- 24 మంది మృతి.. 100 మందికి గాయాలు
- బాధితుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం
- ఇస్లామాబాద్‌లోని, షెహజాద్ పట్టణం, తర్లాయ్ ఇమాంబర్గా వద్ద దాడి..
- మసీదులో మధ్యాహ్నం ప్రార్థనల అనంతరం, మెయిన్ గేట్ వద్ద ఈ ఆత్మాహుతి దాడి
- మసీదు గేటుతోపాటు, చుట్టుపక్కల బిల్డింగులు కూడా ధ్వంసం


ఇస్లామాబాద్

పాకిస్తాన్ రాజధాని, ఇస్లామాబాద్‌లో శుక్రవారం ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ ఘటనలో దాదాపు 24 మంది మరణించగా, 100 మందికిపైగా గాయపడ్డారు. ఇస్లామాబాద్‌లోని, షెహజాద్ పట్టణం, తర్లాయ్ ఇమాంబర్గా వద్దగల మసీదులో మధ్యాహ్నం ప్రార్థనల అనంతరం, మెయిన్ గేట్ వద్ద ఈ ఆత్మాహుతి దాడి జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఈ ఘటనలో 24 మంది మరణించగా, 100 మంది గాయపడ్డారు. బాధితుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, భద్రతా దళాలు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డవారిని స్థానిక ఆస్పత్రికి తరలిస్తున్నారు. పాకిస్తాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (పిమ్స్),

-మిగతా 2లో

## తెలంగాణలో మార్పు మొదలైంది

**అవినీతిపై ప్రజల్లో వ్యతిరేకతతో భాజపాకు పెరుగుతున్న మద్దతు**
**రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా ప్రభుత్వమే లక్ష్యం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**



ఆమనగల్లు, ఫిబ్రవరి 6(నీలగిరి ఎక్స్‌ప్రెస్): తెలంగాణ రాజకీయాల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తున్నదని, రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అధికారం దిశగా దూసుకుపోతున్నదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అవినీతి పాలనపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతే భాజపా బలానికి కారణమని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆమనగల్లు మున్సిపల్ కేంద్రంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారితో కలిసి బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థుల మద్దతుగా నిర్వహించిన భారీ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ...

-మిగతా 2 లో







## విద్యను భారంగా భావించకూడదు.

- కలలు కనకపోవడం నేరం ...కచ్చితంగా కలలు కనాలి
- జీవితంలో ప్రతిదానిలో సమతుల్యత ఉండాలి
- మీరు ఒకవైపే వంగి ఉంటే కచ్చితంగా పడిపోతారు'
- మహిళా క్రికెట్ టీమ్ సభ్యులను కలిసిన విషయాన్ని ప్రస్తావించిన మోడి
- నేను వారి కథలు విన్నప్పుడు నా కళ్లలో నీళ్లు తిరిగాయి
- పరీక్షా పే చర్చ' 9వ ఎడిషన్ సందర్భంగా మోడీ ఎగ్జామ్ వారియర్స్‌తో సంభాషణ

న్యూఢిల్లీ ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కలలు కనకపోవడం నేరం అని ప్రధాని మోడీ విద్యార్థులకు చెప్పారు. పెద్ద కలలు కనాలి. ఆ కలల సాకారం చేసుకోవడానికి కార్యాచరణ ఉండాలని మోడీ విద్యార్థులకు సూచించారు. సిబిఎస్ఇ, ఐఎస్‌సిఇ, ఇతర బోర్డ్ ఎగ్జామ్స్ సమీపిస్తున్న తరుణంలో 'పరీక్షా పే చర్చ' 9వ ఎడిషన్ సందర్భంగా మోడీ ఎగ్జామ్ వారియర్స్‌తో సంభాషించారు. మోడీతో వివిధ రాష్ట్రాల విద్యార్థులు ముచ్చటించారు. గుజరాత్‌లోని దేవ్‌మోగ్రా, కోయంబత్తూరు, రారుపూర్, గౌహతిల నుంచి వచ్చిన విద్యార్థులతో ఆయన సంభాషణలు జరిగాయి.

-మిగతా 2 లో



## అఖండ భారతాన్ని ఖండఖండాలుగా చేస్తాం..

- భారత వ్యతిరేక కుట్రలకు మళ్లీ పాక్ ఆజ్యం
- భారత్ అంతుచూస్తామంటూ, దేశాన్ని విడదీస్తామంటూ ప్రగల్భాలు
- తాజాగా లష్కర్ ఏ తయిబా తీవ్రవాద సంస్థకు చెందిన కీలక నేత ఇండియాకు హెచ్చరికలు జారీ
- ఢిల్లీని వణికిస్తామని, కాశ్మీర్‌కు విముక్తి కల్పిస్తామని బహిరంగంగా హెచ్చరిక

ఇస్లామాబాద్

భారత్‌పై పాక్ కుట్రలు ఆగడం లేదు. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పినా.. ఆ దేశ వైఖరిలో మార్పు రావడం లేదు. భారత వ్యతిరేక కుట్రలకు మళ్లీ పాక్ ఆజ్యం పోస్తోంది. పాక్‌ను స్వర్గధామంగా ఎంచుకున్న ఉగ్రవాదులు ఆ దేశం నుంచి ఇండియాకు బహిరంగ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. భారత్ అంతుచూస్తామంటూ, దేశాన్ని విడదీస్తామంటూ ప్రగల్భాలు పలుకుతున్నారు. తాజాగా లష్కర్ ఏ తయిబా తీవ్రవాద సంస్థకు చెందిన కీలక నేత ఇండియాకు హెచ్చరికలు జారీ చేశాడు. లష్కర్ అగ్రనేతల్లో ఒకడు అయిన సయ్యద్ అబ్దుల్ రెహమాన్ నక్వీ ఒక కార్యక్రమంలో ఇండియాకు వార్నింగ్ ఇచ్చాడు. దేశాన్ని విడదీస్తామని, ఢిల్లీని వణికిస్తామని, కాశ్మీర్‌కు విముక్తి కల్పిస్తామని బహిరంగంగా ప్రకటించాడు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అక్కడి వారు నిర్వహించుకునే కాశ్మీర్ సమగ్రతా దినం సందర్భంగా పాక్‌లోని లాహోర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో రెహమాన్ నక్వీ పాల్గొన్నాడు. ఈ సందర్భంగా నక్వీ మాట్లాడుతూ అఖండ భారతాన్ని ఖండఖండాలుగా చేస్తామన్నాడు. "అఖండ భారతాన్ని విడదీస్తాం. ఆగ్రాను మండిస్తాం. ఢిల్లీని వణికిస్తాం. జమ్మూ-కాశ్మీర్‌కు విముక్తి కల్పిస్తాం" అని నక్వీ అన్నాడు.ఇండియాలోని ప్రధాన నగరాలపై దాడులు చేయాలని అక్కడివారికి

-మిగతా 2లో

## కాంగ్రెస్‌ను ఓడిస్తేనే బతుకులు బాగుపడతాయి

- జిన్నారంను మున్సిపాలిటీ చేసి భారం మోపిన కాంగ్రెస్
- పన్నుల భారం మోపినోళ్లకు ఓటేద్దామా చెప్పండి
- మున్సిపల్ ప్రచారంలో నిలదీసిన హరీష్ రావు

సంగారెడ్డి,ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే జిన్నారంను మున్సిపాలిటీ చేసి మీ మీద పన్నుల భారం మోపిందని, ఇప్పుడు ఎవరికి ఓటేద్దాం..? అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీష్‌రావు ఓటర్లను ప్రశ్నించారు. మనల్ని మంచిగా చూసుకున్న వాళ్ళకు, మన భారాన్ని తగ్గించే వాళ్ళకే ఓటేద్దామని అన్నారు. హరీష్‌రావు పటాన్‌చెరువు నియోజకవర్గంలోని జిన్నారం మున్సిపాలిటీలో శుక్రవారం పర్యటించారు.

-మిగతా 2 లో



# మూడు నెలల్లో కొత్త రాజకీయ పార్టీ

మొదటి తరువాయి

వ్యాఖ్యానించారు. ప్రజలే తనను నాయకురాలిగా తీర్చిదిద్దాలని, వారి మద్దతే తనకు అసలైన బలమని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌తో తనకు ఒరిగిందేమీ లేదని స్పష్టం చేసిన కవిత.. భవిష్యత్తులో తన రాజకీయ ప్రయాణం పూర్తిగా ప్రజల మద్దతుపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఈ క్రమంలోనే మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు ఎందుకు ప్రచారం చేయడం లేదని కవిత ప్రశ్నించారు. జాగృతి సంస్థ పోటీ చేస్తున్న ప్రాంతాల్లో హరీశ్ రావు ఎందుకు తిరుగుతున్నారని నిలదీశారు. అలాగే కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గానికే ఎందుకు పరిమితమయ్యారని ఆమె ప్రశ్నల వర్షం కురిపించారు. తనపై విమర్శలు చేస్తున్న వారిపై కవిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'గుంటనక్క, గూఢచారి' వంటి పేర్లు వారికి నప్పుతాయి కాబట్టే అలా పిలుస్తున్నాన న్నారు. రాజకీయాల్లో విమర్శలు సహజమేనని, కానీ వ్యక్తిగత ఆరోపణలు చేస్తే తాను కూడా మౌనంగా ఉండబోనని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో తన రాజకీయ వ్యూహం మరింత స్పష్టంగా ఉంటుందని, కొత్త పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలవుతుందని కవిత చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇదిలావుంటే ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై జాగృతి అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

## గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్..

మొదటి తరువాయి

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భమ్రాగడ్ తాలూకాలో గురువారం నుంచి ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది. ఇందులో ఇద్దరు మహిళలతో సహా ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం నుంచి ఒక ఏకే-47 రైఫిల్‌తోపాటు పలు ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టులతో జరిగిన ఎదురుకాల్పుల్లో సీ-60 కమాండో దీపక్ చిన్న మాధవి (38) తీవ్రంగా గాయపడటంతో అతడిని హెలికాప్టర్‌లో భమ్రాగడ్‌లోని ఆస్పత్రికి తరలించగా అక్కడ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో అధికారి కూడా గాయపడగా.. అతడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనా ప్రాంతంలో మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

## ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడి..

మొదటి తరువాయి

పాలీ క్లినిక్‌లకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఆత్మాహుతి దాడి నేపథ్యంలో అప్రమత్తమైన అధికారులు ఇస్లామాబాద్‌లో ఎమర్జెన్సీ విధించారు. ఈ దాడికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఆత్మాహుతికి ఎవరు పాల్పడ్డారు.. ఏ పేలుడు పదార్థం వాడారు వంటి అంశాలపై ఇంకా విచారణ కొనసాగుతోంది. ఈ దాడిలో పేలుడు తీవ్రత ఎక్కువగా ఉంది. మసీదు గేటుతోపాటు, చుట్టుపక్కల బిల్డింగులు కూడా ధ్వంసమయ్యాయి. మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. శరీర భాగాలు చాలా దూరం ఎగిరిపడ్డాయి. ప్రస్తుతం అక్కడి దృశ్యాలు భయానకంగా ఉన్నాయి. గత నవంబర్‌లో కూడా ఇస్లామాబాద్‌లో ఇలాంటి దాడే జరిగింది. అప్పటి ఘటనలో 12 మంది మరణించగా, 30 మందికిపైగా గాయపడ్డారు. ఇక.. తాజా ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

## అఖండ భారతాన్ని ఖండఖండాలుగా చేస్తాం..

మొదటి తరువాయి

పిలుపునిచ్చాడు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు కాశ్మీర్‌కు విముక్తి కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. నక్వీకి 26/11 పేలుళ్లకు సంబంధం ఉంది. దేశంలో అనేక దాడులకు సూత్రధారి అయిన హాఫీజ్ సయీద్‌తో కూడా అతడికి సన్నిహిత సంబంధాలున్నాయి. నక్వీ బహిరంగ వ్యాఖ్యల ద్వారా పాకిస్తాన్.. ఇండియాకు వ్యతిరేక శక్తులకు ఎలా ఆశ్రయం ఇస్తుందో మరోసారి ప్రపంచానికి తెలిసి

## తెలంగాణలో మార్పు మొదలైంది

మొదటి తరువాయి







గత పదేళ్లుగా రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబ పాలన పట్టిపీడించిందని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ సోనియా కుటుంబ ఆధ్వర్యంలో అదే తరహా పాలన కొనసాగుతోందని ఆరోపించారు. ఎంఐఎం పార్టీకి అనుబంధంగా మారిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని విమర్శించారు.దేశ హితమే లక్ష్యంగా పనిచేసే పార్టీ భారతీయ జనతా పార్టీ మాత్రమేనని, సనాతన ధర్మాన్ని వ్యతిరేకించే విధానాలే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఉన్నాయని ఆయన అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీలోని 15 డివిజన్లలో బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే కేంద్ర ప్రభుత్వ సహకారంతో అభివృద్ధికి కొత్త దిశ చూపుతామని హామీ ఇచ్చారు.

నాలుగు లక్షల ఇండ్లు... రూ.100 కోట్లతో మరిన్ని పనులు
– తల్లోజు ఆచారి

జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి మాట్లాడుతూ... ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు నాలుగు లక్షల గృహాలను మంజూరు చేసిందని తెలిపారు. ఆమనగల్లు మున్సిపాలిటీలో ఇప్పటికే 100 శాతం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను పూర్తి చేశామని, కేంద్ర నిధులతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. మరోసారి బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.100 కోట్ల నిధులు తీసుకొచ్చి మున్సిపాలిటీలో సమగ్ర అభివృద్ధి చేపడతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అభ్యర్థులు కండె హరిప్రసాద్, చుక్క అల్లాజీ గౌడ్, సునీత నిరంజన్, జానయ్య, నరేందర్, నరసింహ, మహేష్, మాజీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మెరిసిన యంగ్ ఇండియా

మొదటి తరువాయి




మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ దిగిన భారత్.. ఓపెనర్లు శుభారంభాన్ని అందించారు. డాషింగ్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ తనదైన శైలిలో ఇంగ్లాండ్ బౌలర్లను ఊచకోతకోశాడు. సెమీఫైనల్‌లో సెంచరీ కొట్టిన ఆరోన్ జార్జ్ స్వల్ప పరుగులకే పెవిలియన్ చేరినా..మరో ఎండ్‌లో వైభవ్ దూకుడును కొనసాగించాడు. జార్జ్ ఔట్‌తో క్రీజులోకి కెప్టన్ మాత్రే వైభవ్‌కు పూర్తి తోడ్పాటు అందించాడు. ఇద్దరు కలిసి ఎడాపెడా షాట్‌లతో ఇంగ్లాండ్ బౌలర్లను బెంబేలెత్తించారు. వైభవ్ వీరాబాదుడు ముందు బ్రిటన్ బౌలర్లు తెలిపోయారు. 55 బంతుల్లో సెంచరీ కొట్టిన వైభవ్..ఆ తర్వాత తన ఆటలో వేగం పెంచాడు. కేవలం 17 బంతుల్లో 50 రన్స్ చేసి 150 మార్క్‌ను అందుకున్నాడు. ఓ దశలో డబుల్ సెంచరీ చేస్తాడని అందరూ ఊహించిన తరుణంలోనే..మోర్గాన్ వేసిన 25 ఓవర్లో పరుగుల సునామీ వైభవ్(175-15 ఫోర్లు, 15 సిక్స్) భారీ షాట్ ఆడబోయి కీపర్ క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. అంతకు ముందు కెప్టెన్ మాత్రే అర్ధ సెంచరీ చేసి ఔట్ అయ్యాడు. వీరిద్దరి విధ్వంసకార బ్యాటింగ్‌తో స్కోర్ బోర్డు పరుగులు పెట్టింది. లమ్మెన్ వేసిన 8ఓవర్లో 15, మింటో వేసిన 9 ఓవర్లో 18, ఆమేద్ వేసిన 15ఓవర్లో 15, ఆమేద్ వేసిన 17ఓవర్లో 3సిక్సలు ఓ ఫోర్‌తో 22 పరుగులతో ఆకాశమే హద్దుగా చెలరేగాడు. గ్రీన్ వేసిన 21ఓవర్లో 19, ఆల్ బర్ట్ వేసిన 22ఓవర్లో 27, మోర్గాన్ వేసిన 25 ఓవర్‌లో25 రన్స్‌ను పిండుకున్నాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఇతర బ్యాటర్లు మల్‌హోత్రా 30,కుందా 40, కై చౌహన్ 37 రన్స్ లతో ఇంగ్లాండ్‌కు కొండంతా లక్ష్యాన్ని(411) ముందుంచారు. ఇంగ్లాండ్ బౌలర్లు మింటో 3, మోర్గాన్, గ్రీన్ రెండు వికెట్లు, లమ్మెన్ ఒక వికెట్ తీశారు ఆ తర్వాత చేధనకు దిగిన ఇంగ్లాండ్..ఓపెనర్లు నిరాశపరిచారు. ఇండియన్ పేస్ ద్వయం ధాటికి బ్రిటన్ బ్యాటర్లు తీవ్ర ఇబ్బంది పడ్డారు.రెండు ఓవర్లు ముగిసిన కూడా పరుగుల ఖాతా తెరలేదు. నాలుగో ఓవర్లో జే మోర్స్ రూపంలో ఇంగ్లాండ్ తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత నెమ్మదిగా క్రీజులో కుదురుకోని బీజే డాకిన్స్ 66 పరుగులు చేసి ఔటైయాడు. బీఏ మాయస్ 45, టీహెచ్ రీ 31 రన్స్ తో రాణించారు. చివరిలో మిట్టన్ (28) తో కలిసి సీఎం ఫాల్కనర్(115) వీరోచితంగా పోరాడి బ్రిటన్ విజయంపై ఆశలు పెంచాడు. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఓ ఎండ్‌లో వికెట్లు పడటంతో ఇండియా విజయం లాంఛనమైంది.


# నిజామాబాద్ రైతుల పోరాటం దేశానికే ఆదర్శం

మొదటి తరువాయి

మన వాళ్లు కార్పొరేటర్లుగా ఉంటే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. నేను అందరివాడిని. నాకు కులం, మతం లేదు. ఈ జిల్లా గొప్ప నాయకులను అందించింది. మున్సిపల్ ఎన్నికల్లో విలక్షణమైన తీర్పు ఇవ్వాలి. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిజామాబాద్ మురికి కూపంగా మారిందని మండిపడ్డారు. ధర్మపురి అర్వింద్‌ను ఎంపీగా రెండుసార్లు గెలిపించినా.. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదు. మోదీ మూడు సార్లు ప్రధానమంత్రి అయినా.. నిజామాబాద్ స్మార్ట్ సిటీ కాలేదు. మోదీ దగ్గర ఎంపీ అర్వింద్‌కు పరపతి ఉంటే నిజామాబాద్‌ను ఎందుకు స్మార్ట్ సిటీగా ప్రకటించలేదని ప్రశ్నించారు. కాళేశ్వరంలో ప్రాజెక్టులో అవినీతి జరిగిందని భాజపా చెప్పింది. ఆ కేసును సీబీఐకి అప్పగించాం ఏమైంది? కేసీఆర్, కేటీఆర్‌ను ఎప్పుడు అరెస్టు చేస్తారని భాజపాని అడుగుతున్నానని మరోమారు ప్రశ్నించారు. కెసీఆర్, కేటీఆర్‌ను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కాపాడుతున్నారు. కిషన్‌రెడ్డి.. కల్వకుంట్ల కిషన్‌రావుగా మారారని సీఎం విమర్శించారు. దత్తపుత్రుడు కిషన్ రెడ్డి, దొంగ పుత్రుడు కేటీఆర్ కలిసి కేసీఆర్ ను కాపాడుతున్నారుని ఆరోపించారు. కాళేశ్వరం కేసు సీబీఐ కి ఇస్తే 48 గంటల్లో కేసీఆర్ ను జైల్లో పెడతా మన్న కిషన్ రెడ్డి.. కాళేశ్వరం కేసును బీజేపీ ఎందుకు ముందుకు సాగనీయడం లేదు.. సీబీఐ విచారణ చేయాలని కోరినా ఇప్పుడు ఎందుకు చేయటం లేదని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు దొందు దొందే ..నిజామాబాద్ జిల్లాలో బీజేపీ, బీఆర్ఎస్ లను గెలిపిస్తే అభివృద్ధి జరగదని అన్నారు. బీజేపీనుంచి ఇద్దరు కేంద్ర మంత్రులన్నా.. నిధులు తెచ్చింది నిల్ అన్నారు. జిల్లా అభివృద్దే లక్ష్యంగా కాంగ్రెస్ పనిచేస్తోందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు గెలవాలంటే కాంగ్రెస్ ను గెలిపించుకోవాలన్నారు. అభివృద్దే లక్ష్యంగా నిజామాబాద్ జిల్లాలో అనేక సంక్షేమ కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశాం.. ఒక కార్పొరేషన్, ఏడు మున్సిపాలిటీలలోవెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు సీఎం రేంత్ రెడ్డి.రూ.600కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌నిర్మిస్తున్నామన్నారు. నిజామాబాద్ జిల్లా అభివృద్ధికి 100 శాతం సహకరిస్తా..నిధులిచ్చే బాధ్యత నాది.. నిజామాబాద్ ను అభివృద్ధి చేసే బాధ్యత నాది అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్,సలహాదారు సుదర్శన్ రెడ్డి, మంత్రులు,ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యను భారంగా భావించకూడదు.

మొదటి తరువాయి




కలలు కనకపోవడం నేరం. కచ్చితంగా కలలు కనాలి. కానీ కలల్ని అనుకుంటే సరిపోదు. దానికితగ్గట్టుగా కార్యాచరణ ఉండాలి. జీవితంలో ప్రతిదానిలో సమతుల్యత ఉండాలి. మీరు ఒకవైపే వంగి ఉంటే కచ్చితంగా పడిపోతారు' అని మోదీ అన్నారు. నైపుణ్యాలు రెండు రకాలు. జీవిత నైపుణ్యాలు, వృత్తి నైపుణ్యాలు. ఎవరైనా దేనిపై దృష్టి పెట్టాలని నన్ను అడిగతే.. రెండింటిపై దృష్టి పెట్టమని చెబుతాను. ఇవి రెండు ఒకదానికొకటి ముడిపడి ఉంటాయి. అధ్యయనం చేయకుండా, గమనించకుండా, జ్ఞానాన్ని అన్వయించకుండా ఏదైనా నైపుణ్యాన్ని సంపాదించచ్చా? నైపుణ్యం ప్రారంభం జ్ఞానంతోనే.. దాని ప్రాముఖ్యతను తక్కువ అంచనా వేయలేము అని ప్రధాని విద్యార్థులకు సలహానిచ్చారు. విద్యను భారంగా భావించకూడదు. ఇందులో చొరవ, ప్రమేయం ఉండాలి. చిన్న చిన్న చదువులు విజయాన్ని అందివ్వవు. జీవితం కేవలం పరీక్షల గురించి కాదు. విద్య మన అభివృద్ధికి ఒక మాధ్యమం మాత్రమే. మార్కులపై మాత్రమే దృష్టి పెట్టకుండా.. ప్రతి ఒక్కరూ తరగతి గదులు, పరీక్షలకు మించి జీవితంలో మెరుగుదలపై దృష్టి పెట్టాలి. కొన్నిసార్లు ఉపాధ్యాయులు పరీక్షలకు ముఖ్యమైన వాటిని మాత్రమే బోధిస్తారు. కానీ మంచి ఉపాధ్యాయుడు ప్రతిదీ బోధిస్తాడు. మొత్తం మెరుగుదలపై దృష్టి పెడతాడు అని మోదీ అన్నారు.

ఈ సందర్భంగా అంధుల మహిళా క్రికెట్ టీమ్ సభ్యులను కలిసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. 'వారికి ఇళ్లు లేవు. వారు అంధులు. అయినప్పటికీ వారు ఆడటం నేర్చుకుని, వారి వైకల్యం ఉన్నప్పటికీ ఈ స్థాయికి చేరుకున్నారు. నేను వారి కథలు విన్నప్పుడు నా కళ్లలో నీళ్లు తిరిగాయి' అని ఆయన అన్నారు. కంఫర్ట్ జోన్ జీవితాన్ని రూపొందిస్తుందనే భ్రమలో మనం ఉండకూడదు. మనం ఎలా జీవిస్తామో దాని ద్వారా జీవితం ఏర్పడుతుంది. 2047 నాటికి మీరందరూ 35 -- 40 సంవత్సరాల మధ్య ఉంటారు. వికసిత్ భారత్‌ను నిర్మించడానికి నేను ఎవరి కోసం కష్టపడి పనిచేస్తున్నాను? మీరు కూడా దాని కోసం పని చేయకూడదా? అని అడిగారు. అలాగే దేశీయ తయారీకి మద్దతు ఇవ్వాలని యువ భారతీయులకు పిలుపినిచ్చారు. మనం భారతీయ ఉత్పత్తులను కొనుగోలు చేసి ఉపయోగించాలి అని నొక్కి చెప్పాలని ఆయన అన్నారు. గతేదాది సెప్టెంబర్ 17కి నాకు 75 సంవత్సరాలు పూర్తయ్యాయి. నాకు ఇంకా 25 సంవత్సరాలు మిగిలి ఉన్నాయి. నేను గతాన్ని లెక్కించను. మిగిలిఉన్నదాన్ని లెక్కించను. నేను ఎల్లప్పుడూ రాబోయే వాటిపై దృష్టి పెడతాను. విద్యార్థులు గత వైఫల్యాల గురించి ఆలోచించకుండా భవిష్యత్తు అవకాశాలపై దృష్టి పెట్టాలని మోడీ విద్యార్థులను కోరారు.

# కాంగ్రెస్‌ను ఓడిస్తేనే బతుకుల బాగుపడతాయి

మొదటి తరువాయి

జిన్నారం గ్రామం వాకిటి వద్ద స్థానికులతో ముచ్చటించిన ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్న తీరును ఎండగట్టారు. తాము అధికారంలో ఉన్నప్పుడు జిన్నారం గ్రామం గ్రామపంచాయతీగానే ఉండాలని కోరుకున్నామని, మున్సిపాలిటీ అయితే ప్రజల మీద పన్నుల భారం పడుతుందని ఆపామని చెప్పారు. కానీ కేసీఆర్ రూ.200 ఉన్న పెన్షన్‌ను రూ.2000 చేస్తానని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే ఆ హామీని నెరవేర్చారని చెప్పారు. రేవంత్ రెడ్డి రూ.4000 ఇస్తానని చెప్పి రెండేళ్లు గడిచినా ఇవ్వడం లేదని విమర్శించారు. ఏపీలో చంద్రబాబు రూ.4000 ఇస్తానని చెప్పి ఇస్తున్నాడు కదా? మరి ఇక్కడ రేవంత్ రెడ్డికి ఎందుకు చేతులు రావడం లేదు..? అని ప్రశ్నించారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2500 ఇస్తానని చెప్పి రేవంత్ రెడ్డి మోసం చేశాడని హరీష్‌రావు విమర్శించారు. ఈ 24 నెలల్లో ఒక్కో మహిళకు ప్రభుత్వం రూ.60,000 చొప్పున బాకీ పడిందని అన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు బతుకమ్మకు ప్రతి మహిళకు చీర ఇచ్చేదని, రేవంత్ రెడ్డి వచ్చాక చీర లేదు, గాజులు లేవని చెప్పారు. ఏదో గ్రూపులో ఉన్న కొద్దిమందికి ఇచ్చి చేతులు దులుపుకున్నాడని అన్నారు. ఫ్రీ బస్సు అని చెప్పి మగవాళ్లకు టికెట్ రేట్ డబుల్ చేశాడని తెలిపారు. ఆడోళ్ళకు సీటు దొరక్క తిప్పలు పడుతున్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి వచ్చాక 5 పంటలు వస్తే.. రెండింటికి ఇచ్చి మూడింటికి రైతుబంధు ఎగ్గొట్టాడని విమర్శించారు. నాటేసిన వాళ్లకే రైతుబంధు ఇస్తా, శాటిలైట్‌లో చూసి ఇస్తా అని కొత్త నిబంధనలు పెట్టి రైతులను గోస పెడుతున్నాడని రేవంత్‌రెడ్డిపై హరీష్‌రావు మండిపడ్డారు. దేవుడి మీద ఒట్టు వేసి రుణమాఫీ చేస్తానని చెప్పి మాట తప్పిన పాపాత్ముడు రేవంత్ రెడ్డి అని విమర్శించారు. ఏ ఊర్లో చూసినా సగం మందికి కూడా రుణమాఫీ కాలేదన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో మీరు కారు గుర్తుకు ఓటు గుద్దితే.. రేవంత్ రెడ్డికి గూబ గుయ్యిమనాలె అని పిలుపునిచ్చారు. అప్పుడే భయపడి హామీలైనా అమలు చేస్తాడని అన్నారు. ఓటుకు 5 వేలు ఇస్తామంటారని, అవి తీసుకొని మోసపోవద్దని హెచ్చరించారు. మహిళలకు రావాల్సిన రూ.60,000, అవ్వ తాతలకు రూ.4000 పెన్షన్ రావాలంటే బీఆర్ఎస్ గెలవాలని అన్నారు. అవ్వతాతలు పెన్షన్ అడిగితే లాగుల తొండలు ఇడిసిపెడతా అంటాడని, మహిళలు హామీల గురించి అడిగితే మెడలో పేగులు వేసుకుంటా అంటాడని, తులం బంగారం ఏదని అడిగితే గుడ్లు పీకి గోటీలు ఆడుతా అంటాడని హరీష్‌రావు సీఎంను విమర్శించారు. ప్రశ్నిస్తే కళ్లు నెత్తికెక్కి మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పి సీఎం అహంకారాన్ని దించాలని పిలుపునిచ్చారు. రెండేళ్లు ఓపిక పట్టాలని, వచ్చేది మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమేనని అన్నారు. జిన్నారం సమస్యలు పరిష్కరించుకుందామని చెప్పారు. రేవంత్ రెడ్డి ముస్లింలకు ఒక్క రూపాయి పని కూడా చేయలేదని, కాబట్టి అందరూ ఏకమై కారు గుర్తు అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

# ఆశీర్వదించి గెలిపిస్తే.. అభివృద్ధి చేస్తాలి

**- మున్సిపాలిటీ 12వ వార్డు అభ్యర్థి అప్పం శ్రీను**



**ఆమనగల్లు, ఫిబ్రవరి 6(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** కాంగ్రెస్ పార్టీ నుంచి కౌన్సిలర్ గా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించి మంచి మెజారిటీతో గెలిపిస్తే 12వ వార్డును అన్ని విధాల అభివృద్ధి చేస్తానని అప్పం శీను అన్నారు. శుక్రవారం కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరిగి చెయ్యి గుర్తుకు ఓటెయ్యాలని ప్రజలను అభ్యర్థించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉందని 12వ వార్డులో తమను గెలిపిస్తే ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ప్రజా సమస్యలన్నీ పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్తోనే సబండవర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయి అన్నారు. అధికారం లేని పార్టీలకు ఓటేస్తే ప్రజా సమస్యలు పరిష్కారం కావన్నారు. అందుబాటులో ఉంటున్న తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అప్పం రాఘవ, రాజు ఆమీర్, శివ,కాలనీ మహిళలు, కార్యకర్తలు ప్రజలు ఉన్నారు.

# కల్వకుర్తి మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ దూకుడు

**కల్వకుర్తి, ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ప్రచారం జోరుగా సాగుతోంది. 13వ వార్డులో పార్టీ అభ్యర్థి రామస్వామి తరపున జూపల్లి భాస్కర్‌రావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం నుంచి పట్టణ అభివృద్ధి వరకు కల్వకుర్తిలో కనిపిస్తున్న ప్రతి మార్పు వెనుక బిఆర్ఎస్ ముద్ర స్పష్టంగా ఉందని ఆయన పేర్కొన్నారు.కల్వకుర్తి అంటే పోరాట చరిత్ర, ఆత్మగౌరవ స్వరం అని, అభివృద్ధి పతాకాన్ని మళ్లీ ఎగురవేయగలిగేది బిఆర్ఎస్ మాత్రమేనని భాస్కర్‌రావు అన్నారు. మాటలతో కాదు, పనితో పాలన చేసిన పార్టీ బిఆర్ఎస్ అని, హామీలతో కాదు, అమలుతో ప్రజల నమ్మకం సంపాదించిందని ఆయన స్పష్టం చేశారు.ప్రజల పక్షాన నిలబడి, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న నాయకుడు జూపల్లి భాస్కర్‌రావు ప్రజల మధ్య తిరుగుతూ సమస్యలను తెలుసుకుంటూ పోరాడుతున్నారని పార్టీ నాయకులు తెలిపారు.



“గెలుపు కోసం కాదు, కల్వకుర్తి భవిష్యత్తు కోసం పనిచేస్తున్నాం. ఇతరులకు అవకాశం ఇచ్చాం, ఫలితం చూశాం. ఇప్పుడు మళ్లీ అభివృద్ధికి ఓటు వేయాల్సిన సమయం వచ్చింది. ఈసారి కల్వకుర్తిలో ఒకటే నినాదం -- బిఆర్ఎస్ జెండా, ప్రజల అజెండా” అని భాస్కర్‌రావు పేర్కొన్నారు.ప్రచారంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బిఆర్ఎస్‌కు తమ మద్దతు ప్రకటించారు. ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని పార్టీ నాయకులు తెలిపారు.

# పత్తి పంటలో అధిక సాంద్రత పద్ధతి మధ్యస్థ పద్ధతులపై క్షేత్ర దినోత్సవం





**ఆమనగల్లు, ఫిబ్రవరి 6(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** రంగారెడ్డి జిల్లా ఆ మనగల్లు మండలం మంగళపల్లి గ్రామంలో పత్తి పంటలో అధిక సాంద్రత పద్ధతి, మధ్యస్థ సాంద్రత పద్ధతి మరియు యాంత్రీకరణ అంశాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు క్షేత్ర దినోత్సవం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో డా. ఎస్. దిలీప్, శాస్త్రవేత్త (వ్యవసాయ విస్తరణ), కృషి విజ్ఞాన కేంద్రం, పత్తి సాగులో అధిక సాంద్రత పద్ధతి మరియు మధ్యస్థ సాంద్రత పద్ధతుల ప్రాధాన్యతను వివరించారు. అలాగే చేతితో ఉపయోగించగల, బ్యాటరీ ఆధారిత కాటన్ పిక్కర్, కాటన్ శ్రే డర్ వినియోగం ద్వారా కూలీ ఖర్చులు తగ్గించి లాభాలు పెంచుకోవచ్చని రైతులకు తెలియజేశారు. బాలకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ), మంగళపల్లి, పత్తి విత్తనాల ఎంపిక, నాణ్యత ప్రమాణాలు, అలాగే అధిక సాంద్రత మరియు మధ్యస్థ సాంద్రత పద్ధతులకు అనుకూలమైన సిఫార్సు చేసిన నాటే దూరాలపై రైతులకు మార్గదర్శనం చేశారు.

మంగళపల్లి గ్రామానికి చెందిన రైతు తిప్పిరెడ్డి కొండల్ పొలంలో క్షేత్ర పరిశీలన నిర్వహించబడింది. ఆయన అధిక సాంద్రత మరియు మధ్యస్థ సాంద్రత పద్ధతులను అనుసరించడం ద్వారా పొందిన విజయాలను రైతులతో పంచుకున్నారు.



ఈ సందర్భంగా ఆనంద్, రాశి సీడ్స్ ఫీల్డ్ ఆఫీసర్, ఆధునిక పత్తి విత్తనాల ప్రాధాన్యత మరియు సరైన విత్తన వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమాన్ని కృషి విజ్ఞాన కేంద్రం, సిబ్బంది మరియు యంగ్ ప్రొఫెషనల్స్, సునీత్, చందు, కె. మధు సుధన్, ఎం. స్వేత, డి. ప్రశాంతి, సమర్ధవంతంగా నిర్వహించారు. ఈ క్షేత్ర దినోత్సవంలో మంగళపల్లి, కొనాపూర్, మార్పల్లి, జూపల్లి, చౌదరిపల్లి, జంగారెడ్డిపల్లి, రాగాయన్‌పల్లి తదితర 8 గ్రామాల నుంచి మొత్తం 70 మంది రైతులు పాల్గొన్నారు. రైతులు అధిక సాంద్రత, మధ్యస్థ సాంద్రత పద్ధతులు మరియు యాంత్రీకరణను తమ పొలాల్లో అమలు చేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు. కార్యక్రమం రైతుల నుంచి వచ్చిన సానుకూల స్పందనతో విజయవంతంగా ముగిసింది.




# ఆశీర్వదించండి.. అభివృద్ధికి పాటుపడుతా

**-5 వ వార్డు టిఆర్ఎస్ అభ్యర్థి పాపిశెట్టి రామకృష్ణ**



**ఆమనగల్లు, ఫిబ్రవరి 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)** ఐదవ వార్డు అభ్యర్థిగా తనను ఆశీర్వదిస్తే అభివృద్ధికి నిరంతరం పాటు పడతానని ఆమనగల్లు మున్సిపాలిటీ ఐదవ వాడు టిఆర్ఎస్ అభ్యర్థి పాపిశెట్టి రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన ఐదవ వార్డులో టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదవ వార్డు ప్రజలు తనకు ఒక్క అవకాశం ఇస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వార్డులో మిగిలిపోయిన అభివృద్ధి పనులు ఫలితంగా పూర్తి చేస్తానన్నారు. ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది.

# ప్రజల ఆశీర్వాదంతో ముందుకెళ్తున్న 15 వ వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి కండె సీతారాములమ్మ



**ఆమనగల్లు, ఫిబ్రవరి 6(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** బిజెపి పార్టీపై ఉన్నా నమ్మకంను ఆయుధంగా చేసుకుని 15వ వార్డులో క్షేత్రస్థాయిలో ప్రజల ఆశీర్వాదంతో ముందుకు సాగుతున్నట్లు 15వ వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి కండె సీతారాములమ్మ ఓటర్లను కోరారు. శుక్రవారం 15 వార్డులో తిరిగి ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో బిజెపికి అనుకూల వాతావరణం ఉందన్నారు. నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, తాను కౌన్సిలర్గా నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కమలం పువ్వు గుర్తుకు తమ అమూల్యమైన ఓటు వేసి ఆశీర్వదించాలని ఆమె ప్రజలను కోరారు. అభివృద్ధి విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వాల నిధులతో వార్డులో సదుపాయాలు కల్పిస్తానని, అభివృద్ధికి పాటుపడుదామని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కండె భాస్కర్,సుమన్,గిరి, రాజు, లక్ష్మణ్, శీను, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# ఓటు మీది... అభివృద్ధి నాది

**9వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి గుర్రం కేశవులు**



**ఆమనగల్లు, ఫిబ్రవరి 6(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఓటు మీది అభివృద్ధి నాది అంటూ తొమ్మిదో వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి గుర్రం కేశవులు ప్రచారం నిర్వహిస్తున్నారు. మీ అమూల్యమైన ఓటును చేతి గుర్తుకు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. శుక్రవారం ఆయన 9వ వార్డులోని కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వార్డు అభివృద్ధికి నిధులు తెచ్చి ప్రతి గల్లీని అభివృద్ధి చేసే బాధ్యత తనదన్నారు. ఇదివరకే సీసీ రోడ్ల నిర్మాణం, అండర్ డ్రైనేజ్, పార్కుల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించి వాటిని త్వరగా పూర్తిచేసే ప్రజలకు అందుబాటులోకి తెస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంది కాబట్టి తను గెలిపిస్తే అభివృద్ధి వేగం పెరుగుతుందన్నారు. చేతి గుర్తుకు ఓటేయాలని కోరారు.

# ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న కేఎల్ఆర్



**బాలాపూర్, ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని పహాడీషరీఫ్ దర్గాలో 760వ ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్) ముఖ్య అతిథిగా పాల్గొని అల్లాకు గంధం సమర్పించారు. దర్గా ముజావర్లు, మతపెద్దల ఆశీస్సులు తీసుకున్న కేఎల్ఆర్ మాట్లాడుతూ, భక్తుల కోర్కెలు తీర్చే బాబా షర్‌పుద్దీన్ దర్గాకు ప్రత్యేక గుర్తింపు ఉందని, శాంతి సామరస్యం వెల్లివిరుస్తున్న ఈ ఉత్సవాల్లో ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం సంతోషకరమని అన్నారు. ఉత్సవాలకు కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ. 21 లక్షలు కేటాయించిందని, అన్ని మతాల పండుగలకు సమాన గౌరవం ఇస్తుందని లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మైనార్టీ సోదరులు కేఎల్ఆర్‌కు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ అబ్దుల్లా బినావత్, పహాడీషరీఫ్ నేత కొండల్ యాదవ్, మైనార్టీ నాయకులు జహంగీర్, యూసుఫ్ ఖాద్రీ, జంగయ్యతో పాటు పలువురు కాంగ్రెస్, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

# కొలనుగూడ గ్రామానికి సీసీ రహదారి


- మంత్రి శ్రీధర్‌బాబు శంకుస్థాపన




**కందుకూర్, ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూర్ మండలం కొలనుగూడ గ్రామంలో సీసీ రహదారి నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన జరిగింది. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క నిధులతో, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కృషితో ఈ పనులు ప్రారంభమయ్యాయి. గ్రామాభివృద్ధి కోసం శాయశక్తులా కృషి చేస్తున్నానని కాంగ్రెస్ గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్ బండ రాజు తెలిపారు. కొలనుగూడలో 1.12 కి.మీ. పొడవున సీసీ రహదారి నిర్మాణానికి రూ. 150 లక్షల అంచనా వ్యయంతో టెండర్ మంజూరైనట్లు ఆయన వివరించారు. గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండ మహేందర్, మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ సలీం, వేణు, మధు, బన్నీ, భూపాల్ రెడ్డి, రజినీకాంత్, అరవింద్, గ్రామ పెద్దలు ఆధర్ల రాజు, గురికేల సత్యనారాయణ, సయ్యద్ గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో ప్రగతి శూన్యం

- మాజీ జడ్పీటీసి ద్యాప విజితా రెడ్డి



**ఆమనగల్లు, ఫిబ్రవరి 6(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో ప్రచార ఆ ర్భాటమే తప్ప ప్రగతి ఏమీ లేదని కల్వకుర్తి మాజీ జడ్పీటిసి ద్యాప విజితా రెడ్డి అన్నారు. బీ ఆర్ఎస్ తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ 15వ వార్డు అభ్యర్థి ఎంగలి భాగ్యలక్ష్మి కి మద్దతుగా పాపిశెట్టి రామకృష్ణ తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటేసి భాగ్య లక్ష్మి ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్ లను కోరారు. హామీల అమలుపై కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని కోరారు. ఆమనగల్లు మున్సిపాలిటీపై టిఆర్ఎస్ జండా ఎగరడం ఖాయమని భీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు రఘు, జాంగిర్, కుమార్, చుక్క నిరంజన్ గౌడ్, శివ, మహేష్ నేత, రహీం, మహిళలు తదితరు పాల్గొన్నారు.

# తెలంగాణ పునరుత్పాదక ఇంధనానికి కొత్త దశ

## గ్లోబల్ సోలార్ ఎక్స్‌పో 2026




**హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరిగిన గ్లోబల్ సోలార్ ఎక్స్‌పో 2026 తెలంగాణలో పునరుత్పాదక ఇంధన రంగ భవిష్యత్తుకు కీలక వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఉన్నత స్థాయి ప్యానల్ చర్చలో ప్రభుత్వ విధాన నిర్ణయకర్తలు, విద్యుత్ సంస్థల ప్రతినిధులు, పరిశ్రమ నిపుణులు, ప్రాజెక్ట్ డెవలపర్లు పాల్గొన్నారు. బిడ్ సమర్పణ నుంచి ఫైనాన్షియల్ క్లోజర్, నిర్మాణం, గ్రిడ్ అనుసంధానం, దీర్ఘకాలిక నిర్వహణ వరకు పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల జీవన చక్రంపై సమగ్ర విశ్లేషణ జరిగింది. ప్యానలిస్టులు మాట్లాడుతూ, విస్తారమైన సోలార్ సామర్థ్యం, ముందడుగు వేసే విధాన దృక్పథం ఉన్న తెలంగాణ, అమలు సామర్థ్యం మరియు నియంత్రణ స్పష్టత ఆధారంగా భవిష్యత్ వృద్ధి వేగాన్ని నిర్ణయించుకునే కీలక దశలో ఉందని పేర్కొన్నారు. 2026 నాటికి పునరుత్పాదక ఇంధన మార్కెట్ అవలోకనం, గ్రిడ్ కర్టైల్మెంట్ ప్రమాదాలు, పీపీఏ పునర్‌చర్చలు, చెల్లింపుల ఆలస్యాలు, ఓపెన్ యాక్సెస్, క్యాప్టివ్ మోడళ్లలో అవకాశాలు, సోలార్ పార్కుల స్థితి, విద్యుత్ తరలింపు మౌలిక సదుపాయాల సవాళ్లు, మాడ్యూల్ ధరల ప్రభావం, కేంద్ర--రాష్ట్ర బిడ్ల పురోగతి, అలాగే ఇన్విట్‌లు, ఆస్తి విక్రయాలు, విలీనాలు, ఐపీఓల వంటి ఎగ్జిట్ వ్యూహాలపై లోతైన చర్చ జరిగింది. ఈ ప్యానల్ చర్చలో శక్తి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, సెర్లింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, టీజీజెన్‌కో డైరెక్టర్ పి. బాలరాజు, జెఎస్‌డబ్ల్యూ ఎనర్జీ సీ అండ్ ఐ హెడ్ కిరణ్‌కుమార్ పెర్కా, పవరిక్స్ ఎనర్జీ సీఈఓ పవన్ చంద్ర వి (మోడరేటర్), టీఎస్ఎస్‌పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ చిలుకమరి చక్రపాణి, సీఈఏ మాజీ సభ్యుడు జి. వీర, ఏఎస్‌జే సోలార్ సీఈఓ సత్య వెంకట్ అజయ్‌కుమార్ చిటికాల, వైబ్రెంట్ ఎనర్జీ సీఈఓ వినయ్ పబ్బా, ఎనర్జీ అడ్వైజరీ సర్వీసెస్ ప్రతినిధి త్రినాథ్ చౌదరి, ఏఎస్‌జే సోలార్ ఎనర్జీ డైరెక్టర్ ఉప్పులూరి శ్రీనివాస్ వేణు తదితరులు పాల్గొన్నారు.

# యాంత్రిక సమాజంలో మానవ సంబంధాల మార్పు



**హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నేటి ఆధునిక సమాజం సాంకేతికంగా ఎన్నో ముందడుగులు వేసినా, భావోద్వేగ పరంగా వెనుకబడిపోతోందన్నది కాదనలేని వాస్తవమని సామాజిక కార్యకర్త నీల రవీందర్ పేర్కొన్నారు. ఒకప్పుడు మనుషుల మధ్య ఉండే ప్రేమ, ఆప్యాయత స్థానంలో ఇప్పుడు అవసరం, ప్రయోజనం వచ్చి చేరిందని ఆయన అన్నారు. సోషల్ మీడియా ద్వారా వందల మందితో టచ్‌లో ఉన్నా, మనసు విప్పి మాట్లాడటానికి ఒక్కరు కూడా లేని ఒంటరితనం పెరుగుతోందని వివరించారు. సంబంధాలు ఎక్కువగా 'గివ్ అండ్ టేక్' ధోరణిలో సాగుతున్నాయని, ప్రయోజనం తీరిపోగానే బంధాలు బలహీనపడుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. వేగవంతమైన జీవనశైలి కారణంగా ఓర్పు తగ్గిపోవడం, చిన్న విభేదాలకే విడాకులు, స్నేహ విరహాలు పెరుగుతున్నాయని, అవతలి వ్యక్తి కోణంలో ఆలోచించే సహానుభూతి క్రమంగా కరువవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాడ్జెట్స్‌తో గడిపే సమయం పెరగడం, ఉమ్మడి కుటుంబాల నుంచి వ్యష్టి కుటుంబాలకు మారడం వల్ల పిల్లల్లో సామాజిక స్పృహ, బంధాల పట్ల గౌరవం తగ్గుతోందని ఆయన పేర్కొన్నారు. మనిషిని మనిషిగా ప్రేమించడం నేర్చుకోవాలని, సెల్‌ఫోన్లకంటే పక్కన ఉన్న మనుషులకు ప్రాధాన్యత ఇవ్వాలని, బంధాలలో నాణ్యత ఉండాలని రవీందర్ సూచించారు. సంబంధాలు కేవలం రక్త సంబంధాలు లేదా స్నేహాలు మాత్రమే కాకుండా, మానసిక ఆరోగ్యానికి పట్టుకొమ్మలని, ఈ యాంత్రిక ప్రపంచంలో మనల్ని మనం కోల్పోకుండా ఉండాలంటే హృదయపూర్వక అనుబంధాలను పెంపొందించుకోవడం అత్యవసరమని ఆయన అన్నారు.

# బయ్యానగూడలో ట్రాన్స్ఫార్మర్ షాక్‌తో ఆవు మృతి



**బోడుప్పల్, ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రేటర్ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బయ్యానగూడ ప్రధాన రహదారి పక్కన ఉన్న కరెంట్ ట్రాన్స్ఫార్మర్ నుండి షాక్ తగిలి ఒక ఆవు మృతి చెందింది. ఆవు యజమాని వల్లపు రమేష్ యాదవ్ మాట్లాడుతూ, ఇటీవలే రూ. 80,000 పెట్టి ఆవును కొనుగోలు చేశానని, పాల వ్యాపారమే తన కుటుంబ జీవనాధారం అని, రోజుకు కనీసం పదిలీటర్ల పాలు ఇచ్చే ఆవు విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా చనిపోయిందని వేదన వ్యక్తం చేశారు. తక్షణమే నష్టపరిహారం చెలించి తనను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. స్థానికులు మాట్లాడుతూ, ట్రాన్స్ఫార్మర్ చుట్టూ పెన్సింగ్ లేకపోవడం వల్ల పిల్లలకు, మూగజీవాలకు ప్రమాదకరంగా మారిందని, ఇది చాలా సంవత్సరాలుగా కొనసాగుతున్న సమస్య అని తెలిపారు. ట్రాన్స్ఫార్మర్ నేలమట్టానికి దగ్గరగా ఉండడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, దాని ఎత్తు పెంచి తగిన సౌకర్యాలు కల్పించాలని విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్ఫార్మర్ చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేశారు.

# ఒక్కసారి అవకాశం... మహిళా శక్తితో మార్పు

శంకరగంజిలో శారదా బ్రహ్మం జనప్రభంజనం



**వనపర్తి ఫిబ్రవరి 06(నీలగిరి ఎక్స ప్రెస్):** శుక్రవారం శంకరగంజిలో కాంగ్రెస్ అభ్యర్థి శారదా బ్రహ్మం నిర్వహించిన ప్రచారం జనప్రభంజనంగా మారింది. కాంగ్రెస్ జెండాలతో శంకర్ గంజి ప్రాంతమంతా ఉత్సాహంగా మారింది. ఇల్లు ఇల్లు, షాపు షాపు తిరుగుతూ ప్రతి ఓటర్ని కలుస్తూ, వ్యాపారస్తుల సమస్యలను శ్రద్ధగా వింటూ, రెండు చేతుల నమస్కారంతో ఆప్యాయంగా పలకరించారు. "ఒక్కసారి అవకాశం ఇవ్వండి" అంటూ ప్రతి ఒక్కరితో నేరుగా మాట్లాడిన తీరు ప్రజల మనసులు గెలిచింది. మాటలకే పరిమితమైన రాజకీయాలు కాదు... వినడం, అర్థం చేసుకోవడం, పరిష్కారం చూపించడమే తన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. మహిళగా, కౌన్సిలర్ అభ్యర్థిగా బాధ్యతాయుతమైన పాలన అందిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి ఇది నిదర్శనమని స్థానికులు వ్యాఖ్యానించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం, వనపర్తి ఎమ్మెల్యే మెఘా రెడ్డి బలమైన మద్దతుతో ముందుకు సాగుతున్న కాంగ్రెస్ అభ్యర్థిగా శారదా బ్రహ్మం నిలుస్తున్నారని తెలిపారు. శంకరగంజిలో కనిపించిన స్పందన చూస్తే, ఈసారి మహిళా శక్తితో కాంగ్రెస్ విజయం ఖాయమనే విశ్వాసం కార్యకర్తల్లో వెల్లువెత్తుతోంది.

# ఓటింగ్ ప్రజాస్వామ్యానికి పునాది







**" బ్యాలెట్ బుల్లెట్ కంటే బలమైంది"**
**బిఅబ్రహం లింకన్**

ఒక వ్యక్తి కున్న ఓటు ప్రభుత్వాల నిర్ణయాన్ని ప్రభావితం చేసే సాధనం. సామాజిక 'ఆర్థిక 'రాజకీయ మార్పుకు ఓటే సాధనం .

**ఓటింగ్ రాజ్యాంగ బాధ్యత**

ఓటర్లు అందరు సకాలములో ఓటింగ్ కేంద్రాలకు చేరుకొని ఓటు వెయ్యాలి. ఓటింగులో పాల్గొనడం ప్రతి ఓటరు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక బాధ్యత. ఓటరుగా నమోదైన ప్రతి వ్యక్తి ఓటింగ్ లో తప్పని సరిగా పాల్గొనాలి. ఓటు వేసి తన సార్వభౌమాధికారాన్ని వినియోగించుకోవాలి. ఓటర్లు ఇతర ఓటర్లను కూడా ఓటు వేసే విధంగా ప్రభావితం చేయాలి. దేశంలో ఓటింగ్ ప్రజాస్వామ్యం పటిష్టతకు ముఖ్య సాధన ఓటర్లు తమ అభిప్రాయాలు చేయడానికి తెలియజేయడానికి ఓటింగ్ సరైన విధానం .

**ఓటరు ఆలోచించాలి**

ఓటు ఎవరికి వేయాలి? ఎందుకు వేయాలి? ఏమిచేస్తారని వేయాలి? అన్న ప్రశ్నలకు సమాధానం పట్ల ఆసక్తి గల ఓటరు ఆలోచించాలి . ఎన్నుకోబోయే పార్టీ/ అభ్యర్థి రాష్ట్ర ప్రజల భవిష్యత్ తరాలకు కావలసిన జీవన నాణ్యతను నిర్ణయించే శక్తి సామర్థ్యాలు ఉన్న అభ్యర్థిని ఎన్నుకోవాలి.
పట్టణ ఓటర్లు యువత ఓటింగు లో పాల్గొనాలి
పట్టణ ప్రాంత ప్రజలు యువత పోలింగ్ రోజును సెలవు దినంగా పాటించకూడదు.
తమ తల రాతను మార్చే శాసన కర్తలను

**ఎన్నుకునే దినం**

రాష్ట్ర ప్రగతి పురోగతికి పాటు పడే సుస్థిర ప్రభుత్వ ఏర్పాటు దినంగా ఓటర్లు బావించాలి.ఓటు పోయేకపోవడం వల్ల మీ గొంతును మీరు వదులుకోవడమే. మీరు ఓటు వేయకపోతే మీకోసం మరొకరు నిర్ణయం తీసుకుంటారు. అవినీతి పరులు నేర చరితులు రాజ్యమేలే అవకాశం కలిగించవద్దు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి 'ఆర్థిక ప్రగతి ప్రయోజనాలు చెకూర్చే సామర్థ్యం వున్న అభ్యర్థులకు ఓటు ద్వారా మద్దతు ఇవ్వాలి.

**ఎన్నికలే మార్పుకు**

అవకాశంలి ప్రజాస్వామ్యంలో మార్పు కోసం ఎన్నికలే ఓటర్లకు ఉన్న గొప్ప అవకాశం. ప్రతి వయోజనులు ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి. పోలింగ్ జరిగే ప్రదేశానికి సకాలంలో వెళ్లాలి.ఓటు వేయడంసామాజిక.రాజకీయ హక్కు రక్షణగా భావించాలి. ఓటరుకు మాత్రమే పనికిమాలిన ప్రభుత్వాలను మార్చే శక్తి ఉంది. ప్రతి ఓటరు ఓటు వేయడం కర్తవ్యంగా భావించాలి. ఓటు వేయడానికి ప్రేరేపించాలి. ఆర్థిక ప్రలోభాలకు ఒత్తిడి కి లొంగ కూడదు.అభ్యర్థి చేసే ఒత్తిడి మాయ మాటలు నమ్మకూడదు. ఓటర్లు ప్రజలకు సేవ చేస్తున్న వారిని మాత్రమే ఎన్నుకోవాలి. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి పెట్టుబడుల సమీకరణక ఆదాయ కల్పనకు 'ఉపాధి కల్పన మహిళా 'యువత సాధికారిత సామర్థ్యం ఉన్న పార్టీని /అభ్యర్థులను మాత్రమే ఎన్నుకోవాలి. ఓటుతో ఆర్థిక ప్రగతికి చోటు ఇవ్వాలి. ప్రజలకు పనిచేసే అభ్యర్థిని మాత్రమే ఎన్నుకోవాలి. అభ్యర్థి కులం మతం లేదా ప్రాంతం ఆధారంగా ఓటు వేయకూడదు. ప్రజలకు నమ్మకంగా పనిచేసే నీతి నిజాయితీగా అభ్యర్థిని ఎన్నుకోవాలి. ఎన్నుకున్న తప్పుడు ప్రభుత్వం మన రాష్ట్రాన్ని ప్రజలను సమస్యల్లోకి నెట్టివేస్తుంది. ఓటర్ గాఢ నిద్ర నుండి మేల్కొని ఉత్తమ అభ్యర్థులకు ఓటు వేయాలి. ఓటు తప్పనిసరిగా వేసి అవినీతి నాయకుల నుండి రాష్ట్రాన్ని రక్షించాలి. ఓటర్లు ఎన్నికల సమయంలో మని మద్యం మజిల్ పవర్ కు భయపడకుండా ఓటు వేయాలి.

**మార్పు కోసం ప్రతిజ్ఞ**

మార్పు కోసంఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయాలి. ప్రతి ఓటరు ఓటింగ్లో పాల్గొనడం ద్వారా రాజ్యాంగం కల్పించిన హక్కును వినియోగించుకోవాలి. మార్పు కోసం ఓటును వినియోగించుకోవాలి. ఓటర్లు నిరంతరం అప్రమత్తంగా ఉండి ప్రజాస్వామ్య రక్షణకు తమ ఓటునుహక్కును పెట్టుబడిగా పెట్టాలి.

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు చేసిన వాగ్దానాలను మేనిఫెస్టోలను అమలు తీరును పరిశీలించాలి. రాష్ట్ర భవిష్యత్తు రాబోయేప్రభుత్వ చేతుల్లోనే ఉంటుంది కాబట్టి అవినీతి రహిత పేదరిక రహిత నిరుద్యోగ రహిత రాష్ట్ర ఆవిర్భావానికి నిజాయితీగల అభ్యర్థులకు ఓటర్లు మద్దతు పలకాలి. రాష్ట్రాన్ని ప్రగతిశీల రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రతిజ్ఞ చేయాలి. ఓటు మార్పుకు సాధనం ప్రస్తుత ప్రభుత్వ విధానాలపై అసంతృప్తిని వ్యక్తం చేయడానికి ఓటింగ్ అత్యంత ప్రభావంతమై నటువంటి మార్గం. ఓటింగు పౌరుల సమిష్టి స్వరం ప్రతిబింబిస్తుంది. విజ్ఞతతో వేసే ఓటు సమాజములో గణనీయమైన సామాజిక ఆర్థిక రాజకీయ మార్పులను తీసుకొస్తుంది .ఓటు
ప్రభుత్వాలను నడిపించే శక్తిని కలిగి ఉంది. చారిత్రకంగా చూస్తే ఓటు ప్రభుత్వాలను మార్చివేసింది.

**ఓటు వేయడం పౌరబాధ్యత.**

ఓటర్లు మేల్కొవాలి ప్రగతి శీల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి.

**వ్యాసకర్త**

**నేదునూరి కనకయ్య**
**అధ్యక్షులు**
**తెలంగాణ ఎకనమిక్ ఫోరమ్**
**కరీంనగర్9440245771**



# మిర్యాలగూడ మున్సిపాలిటీలో జోరుగా కాంగ్రెస్ ప్రచారం





**మిర్యాలగూడ, ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మిర్యాలగూడ మున్సిపల్ ఎన్నికల పోరులో ప్రచారం రసవత్తరంగా సాగుతోంది. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం ఎమ్మెల్సీ, ఆదివాసి కాంగ్రెస్ చైర్మన్ కేతావత్ శంకర్ నాయక్, శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి గురువారం 29, 30, 31, 33, 14, 39, 24, 23వ వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు విస్తృతంగా అమలవుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ప్రతి కుటుంబానికి సన్నబియ్యం అందించడం కాంగ్రెస్ పార్టీ ఘనత అని పేర్కొన్నారు. కౌన్సిలర్ అభ్యర్థులను చేయి గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

# ఓటర్లతో మంత్రి దామోదర రాజనర్సింహ ముచ్చట్లు



**షాద్ నగర్, ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** "అమ్మా.. బాగున్నారా.. మా పాలన ఎలా ఉంది.. పథకాలు అందుతున్నాయా.. మీ ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉంది.." అంటూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఓటర్లను ఆప్యాయంగా పలకరించారు. షాద్ నగర్ మున్సిపాలిటీ 14వ వార్డు అభ్యర్థి అందెమోహన్ తరపున ప్రచారానికి వచ్చిన ఆయన స్థానిక భవాని మాత ఆలయం వద్ద రచ్చబండ ఏర్పాటు చేసి మహిళలతో మాట్లాడారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తరువాత పలువీధుల్లో తిరిగి ప్రజలను కలుసుకుని కాంగ్రెస్ పాలనపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. తమ అభ్యర్థి అందెమోహన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి మున్సిపాలిటీని చేతికి అందించాలని మంత్రి రాజనర్సింహ ఓటర్లను కోరారు.

# నూతన గ్రామ పంచాయితీ భవనానికి భూమిపూజ



**కడ్తాల్, ఫిబ్రవరి 06 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :** కడ్తాల్ మండలం మక్తమాదారం గ్రామంలో నూతన గ్రామ పంచాయితీ భవనానికి శుక్రవారం సర్పంచి నర్సింహా గౌడ్, పంచాయితీ వార్డు సభ్యులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజల సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచి సులోచన సాయిలు, మాజీ ఎంపిటిసి మంజుల చంద్రమౌళి, వార్డు సభ్యులు ఎన్. యాదగిరి, శ్రీకాంత్, యాదయ్య, మైసమ్మ, కార్యదర్శి వెంకట్ రెడ్డి, నాయకులు నగేష్, చందు, మహేందర్, రమేష్, రామస్వామి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఎడ్మ రాధిక సత్యం మద్దతుగా బిఆర్ఎస్ ప్రచారం



**కల్వకుర్తి, ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా 16వ వార్డు అభ్యర్థి ఎడ్మ రాధిక సత్యం మద్దతుగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వెల్దండ మండల బిఆర్ఎస్ నాయకులు పుట్ట రాంరెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు కానుగుల జోగయ్య, బోల్గం తిరుపతిరెడ్డి, జంగిలి ఆనంద్, చుక్కనపల్లి రామచందర్, గుండాల శీను, గడుసు శివ, పోతేపల్లి అంజి మాస్టరు తదితరులు ప్రచారంలో పాల్గొని ఓటర్లను కలుసుకున్నారు. గడపగడప ప్రచారంలో భాగంగా కానుగుల జోగయ్య మాట్లాడుతూ, కెసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు మళ్లీ కొనసాగాలంటే 16వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి ఎడ్మ రాధిక సత్యం గెలవాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను గాలికి వదిలేసి, కెసిఆర్‌పై కక్ష కట్టి సిట్ ద్వారా నోటీసులు ఇవ్వడం కక్షపూరిత చర్యగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

# దేవరకొండలో బిఆర్ఎస్ జోరుగా ప్రచారం

**-ఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు బ్రహ్మరథం పడుతున్న దేవరకొండ పట్టణ ప్రజలు.**
**-మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్.**



**దేవరకొండ ఫిబ్రవరి 06 (నీలగిరి ఎక్స్ ప్రెస్) .**

మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా దేవరకొండ మున్సిపాలిటీలో 3,15, వార్డులలో ఇంటింటి ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరిన బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్
3వ వార్డు అభ్యర్థిగా అంకురి వాణి-అమర్నాథ్ కారు గుర్తుకు.
15వ వార్డు అభ్యర్థిగా జాకిరియాబేగం జనీబాబ కారు గుర్తుకు.
ఓట్లను వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

**ఆయన మాట్లాడుతూ...**

దేవరకొండ పట్టణంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ ఆయాంలో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గల్లి గల్లికి సిసి రోడ్లను, ప్రతి ఇంటికి తాగడానికి నల్ల కలెక్షన్లు ఇచ్చి నీటిని అందించిన ఘనత మాకే దక్కుతుందని తెలిపారు. దేవరకొండ ఖిలాలో 5కోట్లతో పార్క్ ఏర్పాటు చేశామని తెలిపారు.

# బూర్గులలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం

**ఫరూఖ్‌నగర్, ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ప్రగతి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్ నీలోఫర్ చిల్డ్రన్స్ వైద్య నిపుణులు డాక్టర్ అర్జున్ బృందంతో కలిసి విద్యార్థులకు పలు రకాల చికిత్సలు అందించారు. హై స్కూల్, ప్రైమరీ స్కూల్‌లలో చదువుతున్న సుమారు 320 మందికి పైగా చిన్నారులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అర్జున్ మాట్లాడుతూ, నావజాత శిశువు నుండి 10 సంవత్సరాల వయసు వరకు శారీరక, మానసిక ఆరోగ్యకరమైన పెరుగుదల అత్యంత ముఖ్యం అని పేర్కొన్నారు. ప్రస్తుతం శీతాకాలం కావడంతో సీజనల్, వైరల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని



సూచించారు. ప్రగతి వెల్ఫేర్ ఆధ్వర్యంలో గ్రామంలో విద్యార్థులకు ఉచిత వైద్య సేవలు అందించడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయుల బృందం ప్రగతి వెల్ఫేర్ కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పారిశుద్ధ కార్మికులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నీలోఫర్ వైద్యులు ధనలక్ష్మి, దివ్య, ప్రేమ్, చిల్డ్రన్స్ వైద్యుల అసోసియేషన్ రాష్ట్ర శాఖ కోశాధికారి డాక్టర్ శ్రీకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రీతి బాల, ఐసీడీఎస్ సూపర్వైజర్ సంధ్యారాణి, మెడికల్ ఆఫీసర్ రాఘవేంద్ర, మున్రే ఫార్మ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం తోనే అభివృద్ధి సాధ్యం

### ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.



**దేవరకొండ ఫిబ్రవరి 06. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** రాష్ట్ర మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం దేవరకొండ పట్టణంలోని 18వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ఉప్పల శ్రీనివాసులు గెలుపును ఆకాంక్షిస్తూ, గడప గడపకు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ,ప్రజా పాలన ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ, మీ అమూల్యమైన ఓటు కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుపై వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓట్లను అభ్యర్థించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పట్టణ ముఖ్య నాయకులు, అభ్యర్థులు, మహిళలు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 12 సమ్మెను జయప్రదం చేయండి: సీఐటీయు

**నల్లగొండ, ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని, ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మన్నెం బిక్షం పిలుపునిచ్చారు. శుక్రవారం తిప్పర్తిలో ఆశ వర్కర్స్ ఆధ్వర్యంలో పీహెచ్‌ఎస్సి వద్ద, వివోఎ ఆధ్వర్యంలో ఏపీఎం గారికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా బిక్షం మాట్లాడుతూ, కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను చౌకగా కార్పొరేట్ శక్తులకు అమ్ముతూ దేశ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలను



రద్దు చేసి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, విభజీ రాంజీ పథకాన్ని రద్దు చేయాలని ఆయన కోరారు. రైతులకు వ్యతిరేకంగా తెచ్చిన విత్తన, విద్యుత్ సవరణ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆశ, వివోఎ వర్కర్స్ సమస్యలను పరిష్కరించి వారికి కనీస వేతనం రూ. 26,000 నిర్ణయించాలని, ఆశలకు ఫిక్స్ వేతనం ఇవ్వాలని, కార్మికులపై అధికారుల వేధింపులను అరికట్టాలని, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం ప్రతి కార్మికులకు కల్పించాలని ఆయన అన్నారు. కార్మిక హక్కుల రక్షణ కోసం జరుగుతున్న ఫిబ్రవరి 12 సమ్మెలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని బిక్షం పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు దాసరి నిర్మల, ఎలుక కోటిరెడ్డి, ఎండి రూమాన, అనిత దానమ్మ, పూలమ్మ, అ. విజయ, ప్రేమలత, వసంత తదితరులు పాల్గొన్నారు.

# అండగా ఉండి అభివృద్ధి చేసి చూపిస్తా

### -ఏడవ డివిజన్ అభ్యర్థి అయితగాని రాధా స్వామి గౌడ్



**నల్లగొండ ,ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** అధికార కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి అభివృద్ధికి సహకరించాలని 07 వ డివిజన్ కాంగ్రెస్ కార్పొరేట్ అభ్యర్థి అయితగాని రాధా స్వామి గౌడ్ కోరారు. పట్టణంలోని అబ్బాసియ కాలనీ, చైతన్య నగర్, మారుతి నగర్, సాయి నగర్ కాలనీలలో గడపగడపకు ప్రచారం నిర్వహించారు ఏడవ డివిజన్ లోని ప్రతి సమస్య తనకు తెలుసు అని ప్రతినిత్యం ప్రజల మధ్యలోనే ఉంటూ ప్రజా సమస్యలు తెలుసుకొని సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారంతో 07 వ డివిజన్ లో అభివృద్ధిలో అగ్ర గామిగా తీర్చిదిద్దుతానని అన్నారు. తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కనగల్ మాజీ జడ్పిటిసి చిట్ల వెంకటేశం, చనగాని యాదగిరి, గోపాల్ రెడ్డి, వినాయత్, బాబా చెనగాని భిక్షం, అయితగాని నరేందర్, అయితగాని రమేష్ ,బక్క రాజశేఖర్, కడారి శంకర్, భారీ ఎత్తున కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ సాయం

**కడ్తాల్, ఫిబ్రవరి 06 ( నీలగిరి ఎక్స్ ప్రెస్** కడ్తాల్ మండలం గానుగుమర్ల తండ గ్రామపంచాయతీ పరిధిలో కానుగు భాయ్ తండా లో గురువారం సాయంత్రం అనారోగ్యంతో బాధపడుతూ నేనావత్ బుజ్జి మృతి చెందింది. స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న కడ్తాల్ మాజీ జడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ నేనావత్ బుజ్జి మృతదేహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడి తన రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఏ సహాయం చేయడానికి అయినా ముందుంటుందని తన చారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ. 5 వేల రూపాయలను నేనావత్ బుజ్జి కుటుంబానికి అందించారు. అదే విదంగా మైసిగండి గ్రామానికి చెందిన కేతావత్ హనుమ హైదరాబాదులో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడని ఆటో నడుపుతూ హార్ట్ ఎటాక్ తో



మృతి చెందిన విషయం తెలుసుకున్న లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కడ్తాల్ మాజీ జడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ బాధిత కుటుంబ సభ్యులకు మనోధైర్యం నింపి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి మృతుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందని ఎప్పుడు ఏలాంటి సాయం ఉన్న తను ఉన్నానని భరోసా కల్పించి తక్షణసాయంగా రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ నుండి రూ. 5 రూపాయలను కేతావత్ హనుమ కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు శ్రీను నాయక్, ప్రేమ జవహర్లాల్, మాజీ సర్పంచ్ తులసి రామ్ నాయక్, మాజీ ఎంపిటిసి సక్రి, మాజీ డైరెక్టర్ లయక్ అలీ, మాజీ రైతు సమితి అధ్యక్షులు నరసింహ, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాండు నాయక్,వార్డు సభ్యులు చాంది, లక్ష్మణ్, నాగార్జున మాజీ ఉపసర్పంచ్ శారద, పాండు,నాయకులు భీమన్,శంకర్, జగన్,భాస్కర్, హరి, రాజశేఖర్, గోపాల్, పత్తి రాందాస్,కళ్యాణ్,శీను, చందర్ , రవి, కిషన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



**నల్లగొండ, ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** తిప్పర్తి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల నందు శుక్రవారం రోజు పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు టి రమేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను , పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఏ అపర్ణ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి జిల్లాలోనే మన పాఠశాల మొదటి స్థానంలో నిలబెట్టాలని కోరారు జన్మదినాన్ని పురస్కరించుకొని విద్యార్థుల కు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేసిన ఉపాధ్యాయుడిని అభినందించారు ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల పట్ల సేవాభావం కలిగి ఉండాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అందుబాటులో ఉంటా ప్రజా సమస్యలు తీరుస్తా

### -11వ వార్డు బిజెపి అభ్యర్థి సునీత నాయక్

**ఆమనగల్లు, ఫిబ్రవరి 6(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేస్తానని మున్సిపాలిటీ 11 వ వార్డు బిజెపి అభ్యర్థి సునీత నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం 11వ వార్డులో పలు కాలనీలో కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించి బిజెపి చేపడుతున్న పథకాలను ప్రజలకు వివరించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటేసి సునీత నాయక్ గెలిపించాలని కోరారు. బిజెపితోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమన్నారు.



అవకాశవాదుల మాటలు నమ్మొద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ప్రశాంత్ నాయక్ కాలనీ వాసులు, బిజెపి కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

**అమ్రాబాద్, ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** :అమ్రాబాద్ మండల కేంద్రంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు ఉ అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పనులను శరవేగంగా పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ప్రజలకు సౌకర్యం కలిగేలా



రోడ్డు పనులు సమయానికి పూర్తవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సమీక్ష సమావేశం





**అమ్రాబాద్,ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పదర మండలం రాయలగండి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి జాతర బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ప్రభుత్వ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు ㅡ అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ. ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ, రాయలగండి బ్రహ్మోత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. కళ్యాణ మహోత్సవానికి కులమతాలకు అతీతంగా భక్తులు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. జాతరలో సంస్కృతిక కార్యక్రమాలతో పాటు వాలీబాల్ క్రీడలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. దేవస్థాన కమిటీకి ప్రత్యేక ఆదేశాలు జారీ చేసి, అధికారులతో సమన్వయం చేస్తూ ఏర్పాట్లను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఉమ్మడి అమ్రాబాద్ మండల సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, జడ్పిటిసి సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖ అధికారులు, దేవస్థాన కమిటీ సభ్యులు, భక్తులు, ప్రజా ప్రతినిధులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ విద్యాలయంపై ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆకస్మిక తనిఖీ



**అమ్రాబాద్, జనవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాయలగండి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు ㅡ అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను తెలుసుకొని, వారి విద్యా స్థితి, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని, విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే సూచనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవడం ఉపాధ్యాయుల బాధ్యత అని, సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులను కోరారు. జిల్లా శాఖ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తనిఖీ అనంతరం నూతన ఐమాక్స్ లైట్ ప్రారంభ కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన



**ఉప్పునుంతల, ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామంలో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం జరిగింది. గ్రామ సర్పంచ్ బరిగెల శ్రీకాంత్ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ రేణయ్య యాదవ్, వార్డు సభ్యులు, గ్రామ సంఘం అధ్యక్షులు, సంఘాల సభ్యులు, యువకులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ఇంజనీర్ సైదారావు, సీసీ పద్మ మేడం (సెక్రటరీ), నాగేష్ నాయక్, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

**- సీపీ అంబర్ కిషోర్ ఝా**



**పెద్దపల్లి, ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శాంతినగర్ పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఎస్సైలు, సీఐలు, ఏసీపీలు, డీసీపీతో సమావేశమై ఎన్నికల నిర్వహణపై చర్చించి అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అత్యంత కీలకమని, ప్రతి ఓటరు ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ యంత్రాంగం పటిష్ట భద్రతా చర్యలు చేపట్టిందని ఆయన పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో భద్రతా బందోబస్తు ఉంటుందని, సమస్యాత్మక కేంద్రాల్లో మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, ఏసీపీ జి.కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పురపాలక ఎన్నికల్లో భాగంగా ఎమ్మెల్యే విజయరమణా రావు ప్రచారం



**పెద్దపల్లి, ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
:పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల మైదానంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఉదయం మార్నింగ్ వాక్‌లో పాల్గొన్నారు పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ చింతకుంట విజయరమణా రావు. తరువాత మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 1వ వార్డు (బంధంపల్లి) అభ్యర్థి పురేళ్ల సుధాకర్, 5వ వార్డు అభ్యర్థి గుజ్జుల కుమార్‌కు మద్దతుగా గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ప్రజా పాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి, కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయా వార్డుల ప్రజలు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## చిన్నారుల సంక్షేమమే లక్ష్యంగా దుస్తుల పంపిణీ



**హుస్నాబాద్, ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చిగురుమామిడి మండలంలోని ముల్కనూర్ గ్రామంలో రెండు అంగన్వాడీ సెంటర్లలో చిన్నారులకు దుస్తుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ సాంబారి భారతమ్మ కొమురయ్య ఈ కార్యక్రమంలో పాల్గొని దుస్తులను అందజేశారు. చిన్నారుల సంక్షేమమే లక్ష్యంగా గ్రామపంచాయతీ నిరంతరం పనిచేస్తోందని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందించడమే తమ ప్రధాన ఉద్దేశమని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పైడిపెల్లి వెంకటేష్, వార్డు సభ్యులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మోడల్ స్కూల్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



**ఇల్లంతకుంట, ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇల్లంతకుంట మండల రహీంఖాన్‌పేటలోని మోడల్ స్కూల్ 10వ తరగతి విద్యార్థులకు బి.టి.ఆర్. ఫౌండేషన్ ద్వారా స్టడీ మెటీరియల్ అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు బెంద్రం తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు సాధించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు పరీక్షల్లో మంచి గ్రేడ్‌లు సాధించేందుకు ఉచితంగా స్టడీ బుక్స్ అందజేస్తామని, చదువులో ఎలాంటి సహాయం కావాలన్నా ముందుండి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గంగాధర్, ఉపాధ్యాయులు బొల్లారం ప్రసన్న కుమార్, ఉపసర్పంచ్ గడ్డమీద పద్మ, సాక్షి పత్రిక జిల్లా ఇంచార్జీ శ్రీకాంత్ గౌడ్, కొయ్యెడ రాజయ్య, కుస నరేష్, చుక్క రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన భవన శంకుస్థాపనతో గ్రామాభివృద్ధికి మరో ముందడుగు



**హుస్నాబాద్, ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయం మరియు వివో భవనం శంకుస్థాపన ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ వేల్పుల సంపత్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్త కార్యాలయం మరియు వివో భవనం గ్రామాభివృద్ధికి దోహదపడతాయని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ స్వారన్, పంచాయతీ రాజ్ ఏఈ రవిచంద్ర, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఏపిఎం తిరుపతి, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు, వివో అధ్యక్షులు వాణి, కార్యదర్శి పొన్నబోయిన సునీత, కోశాధికారి కృప, పొన్నబోయిన సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఎన్.హెచ్ 167కే భూసేకరణపై కలెక్టర్ సమీక్ష



**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జాతీయ రహదారి భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలో చివరి దశలో ఉన్న భూసేకరణకు సంబంధించి పరిహార చెల్లింపులు, ప్రక్రియ పురోగతిని వేగవంతం చేయాలని ఆయన సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జాతీయ రహదారి, రెవెన్యూ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు మానవీయ కోణంలో లాభాలు వివరించి, జాప్యం లేకుండా భూసేకరణను పూర్తి చేయాలని ఆర్డీవోలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ, జాతీయ రహదారి నిర్మాణ అధికారులు సమన్వయంతో పనిచేసి రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని దేశీ ఇటికాల భూసేకరణ నోటిఫికేషన్లు, పరిహారం, అవార్డుల ఖరారు అంశాలపై కూడా కలెక్టర్ చర్చించారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారికి త్వరితగతిన న్యాయం చేయాలని ఆయన అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సమావేశంలో జాతీయ రహదారి భూసేకరణ అధికారి సత్యనారాయణ, డిఈ రమేష్‌బాబు, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి ఆర్డీవోలు సురేష్, బన్సీలాల్, జనార్దన్‌రెడ్డి, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గర్భం కొనసాగించాలని ఏ మహిళను ఒత్తిడి చేయలేం

**న్యూఢిల్లీ : ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఏ మహిళను కూడా తాము ఇష్టంలేని గర్భం కొనసాగించాలని ఒత్తిడి చేయలేమని సుప్రీంకోర్టు (ాబజూతీవఎవ జశీబతీ) స్పష్టం చేసింది. అవాంఛిత గర్భధారణకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం ఈవిధంగా స్పందించింది. తనకు ఇష్టం లేకపోయినా గర్భం కొనసాగించాలని తాము ఏ మహిళను ఒత్తిడి చేయలేమని పేర్కొంది. మైనర్‌గా ఉండి గర్భవతి అయిన ఓ బాలిక 30 వారాల గర్భాన్ని వైద్యపరంగా తొలగించుకునేందుకు అనుమతి కోరుతూ పిటిషన్ వేసింది. దాంతో గర్భవిచ్ఛిత్తికి ఆమెకు అనుమతినిస్తూ కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. గర్భవిచ్ఛిత్తికి నిరాకరిస్తూ బాంబే హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఆదేశాలను సుప్రీం ధర్మాసనం పక్కనపెట్టింది. కాగా మహారాష్ట్రకు చెందిన ఓ మైనర్ బాలిక స్నేహితుడితో సంబంధం కారణంగా కొన్ని నెలల క్రితం గర్భం దాల్చింది. అప్పుడు ఆమె వయసు 17 ఏళ్లు. ప్రస్తుతం ఆమె వయసు 18 సంవత్సరాల నాలుగు నెలలు.




ఇప్పుడు ఆమె 30 వారాల గర్భిణిగా ఉంది. ఈ క్రమంలో గర్భవిచ్ఛిత్తి కోసం అమ్మాయి తొలుత బాంబే హైకోర్టును ఆశ్రయించగా.. మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టం ప్రకారం గడువు మించిపోవడంతో కోర్టు అందుకు నిరాకరించింది. దాంతో ఈ కేసు సుప్రీంకోర్టుకు చేరింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన సుప్రీం ధర్మాసనం విచారణ చేపట్టింది. గర్భిణి నిర్ణయానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని, ముఖ్యంగా గర్భధారణ కొనసాగింపుపై అయిష్టత వ్యక్తం చేసిన పరిస్థితుల్లో ఆమె స్వేచ్ఛకు వదలివేయాలని సూచించింది. అయితే ఈ కేసులో పిండం కూడా ఒక ప్రాణమే అయినప్పటికీ మరో మార్గం లేదని పేర్కొంది. ఎంటీపీ చట్టం ప్రకారం గడువు ముగిసినప్పటికీ గర్భవిచ్ఛిత్తి జరుగుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఇలాంటి సందర్భాల్లో బాధితులు ఎక్కడికి వెళ్తారనే ప్రశ్నను ధర్మాసనం లేవనెత్తింది. నకిలీ, అనధికార వైద్యుల వద్దకు వెళ్తారని, అది మరింత ప్రమాదకరమని చెప్పింది. ఈ కేసులో గర్భవిచ్ఛిత్తికి అనుమతించినా అమ్మాయికి ఎలాంటి ప్రమాదం ఉండదని వైద్యులు ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకొన్న ధర్మాసనం తాజా తీర్పు చెప్పింది.

# ఢిల్లీలో అమ్మాయిల మిస్సింగ్.

## తప్పుడు ప్రకటనలు నమ్మొద్దంటున్న పోలీసులు

**న్యూఢిల్లీ : ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఢిల్లీలో ఇటీవల అమ్మాయిలు ఎక్కువగా తప్పిపోతున్నారంటూ స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఢిల్లీ పరిధిలోని యూజర్ల వాట్సాప్, సోషల్ మీడియాలో ఈ అంశానికి సంబంధించిన వీడియోలు వైరల్ అవుతున్నాయి. దీంతో అక్కడి మహిళలు, యువతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై ఢిల్లీ పోలీసులు స్పందించారు. ఆన్‌లైన్‌లో జరుగుతున్న ఇలాంటి ప్రచారాన్ని నమ్మొద్దని, ప్రజలు భయాందోళనకు గురికావొద్దని పోలీసులు సూచించారు. ఇదంతా ప్రజల్ని భయపెట్టడానికి జరుగుతున్న ఆన్‌లైన్ పెయిడ్ ప్రచారం అని, వైరల్ కంటెంట్ ఒరిజినల్స్‌ను విశ్లేషించి చెబుతున్నామని తెలిపారు. అమ్మాయిలు ఎక్కువగా మిస్ అవుతున్నారంటూ కొందరు చేస్తున్న పెయిడ్ ప్రచారాన్ని నమ్మవద్దని, ఇలాంటివి ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఢిల్లీ పోలీసులు హెచ్చరించారు. ఢిల్లీ పోలీసులు





వెల్లడించిన డాటా ప్రకారం.. గత జనవరి 1 నుంచి 15 వరకు ఢిల్లీ నగరంలో 807 మంది కనిపించకుండా పోయారు. సగటున రోజుకు 54 మంది తప్పిపోయారు. వీరిలో 509 మంది స్త్రీలు, 298 మంది పురుషులు. ఇందులో 191 మంది మైనర్లు, 616 మంది పెద్దవారు. జనవరి 1 నుంచి జనవరి 27 వరకు ఉన్న డేటా ప్రకారం.. తప్పిపోయిన వారిలో 235 మందిని పోలీసులు గుర్తించగా.. 572 మంది ఆచూకీ ఇంకా దొరకలేదు. సగటున రోజుకు 27 మంది తప్పిపోగా, 9 మందిని గుర్తించారు. మొత్తంగా 181 మందిని గుర్తించారు. వీరిలో 90 మంది పురుషులు, 91 మంది స్త్రీలు ఉన్నారు. 435 మంది పెద్దవారి ఆచూకీ ఇంకా తెలియలేదు. అయితే.. ఈ డేటా ప్రకారం.. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మిస్సింగ్ కేసులు ఏమీ పెరగలేదని పోలీసులు అంటున్నారు. ఇంకా చెప్పాలంటే ఈ జనవరిలో మిస్సింగ్ కేసులు తగ్గాయని జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సంజయ్ త్యాగి అన్నారు. అందువల్ల మహిళలు ఎక్కువగా తప్పిపోతున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దని సూచించారు. అయితే, ఈ ప్రచారంపై అధికార బీజేపీ స్పందించింది. హిందీ చిత్రం మర్దానీని ప్రమోట్ చేసేందుకే ఈ తరహా ప్రచారాన్ని మొదలుపెట్టారని విమర్శిస్తోంది. మరవైపు ప్రతిపక్ష ఆప్ మాత్రం బీజేపీపై విమర్శలు గుప్పిస్తోంది. ఢిల్లీని మిస్సింగ్ పీపుల్ సిటీగా మారుస్తున్నారని మండిపడింది.

# విదేశాల నుంచి 23 వేల మంది భారతీయుల బహిష్కరణ..

## 2025 గణాంకాలు విడుదల

**న్యూఢిల్లీ : -ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తమ దేశంలో ఉంటూ, నిబంధనలు పాటించని విదేశీయుల్ని ఆయా దేశాలు బహిష్కరించడం సహజమే. అలాగే విదేశాల్లో ఉంటున్న భారతీయుల్ని కూడా అక్కడి నిబంధనలు పాటించకుంటే బహిష్కరించి, తిరిగి పంపిస్తారు. ఇలా గతేడాది ఏకంగా వివిధ దేశాల నుంచి 22,900 మంది భారతీయుల్ని ప్రపంచ దేశాలు బహిష్కరించాయి. దీనికి సంబంధించి కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ తాజాగా పార్లమెంట్‌లో ఒక నివేదిక విడుదల చేసింది. 2025లో విదేశాల నుంచి 22,900 మంది భారతీయులు బహిష్కరణకు గురైనట్లు కేంద్రం వెల్లడించింది. అయితే, ఎక్కువ మంది అనుకునేటట్లు ఇండియన్స్‌ను ఎక్కువగా తిరిగి పంపించిన దేశం



అమెరికా కాదు. సౌదీ అరేబియా నుంచి ఎక్కువ మంది ఇండియన్స్ గతేడాది బహిష్కరణకు గురయ్యారు. ఇందులో జెద్దా నుంచి ఏకంగా 8,921 మంది, జెద్దా నుంచి 4,335 మంది ఒక్క ఏడాదిలోనే బహిష్కరణకు గురై తిరిగి ఇండియాకు వచ్చేశారు. ఆ తర్వాత యూఏఈ నుంచి ఎక్కువ మందిని బహిష్కరించారు. వీరిలో 7,896 మంది భారతీయులు దుబాయ్ నుంచి, 1,662 మంది అబుదాబి నుంచి డిపోర్ట్ అయ్యారు. ఎక్కువ మంది డ్రీమ్ కంట్రీ అమెరికా నుంచి గతేడాది 3,806 మంది భారతీయులు బహిష్కరణకు గురయ్యారు. ఆ తర్వాతి స్థానాల్లో మలేసియా నుంచి 1,675 మంది, మయన్మార్ నుంచి 1,065 మంది, సింగపూర్ నుంచి 300 మంది, మాల్దీవ్స్ నుంచి 150 మంది, యూకే నుంచి 70 మంది భారతీయులు బహిష్కరణకు గురయ్యారు. ఇలా తిరిగొచ్చిన భారతీయుల్లో అత్యధికులు విదేశాలకు వెళ్లేముందు తమ ఏజెంట్లకు సగటున ఒక్కొక్కరు రూ.50 లక్షల వరకు చెల్లించుకున్నారు. కొందరు ఆస్తులు అమ్మడం, తనఖా పెట్టడం చేసి మరీ వెళ్లారు. అయితే, తప్పుడు వీసాలు, సరైన ధృవపత్రాలు లేకపోవడం, అక్కడి నిబంధనలు పాటించకపోవడం వంటి కారణాల వల్ల ఆయా దేశాలు భారతీయుల్ని తిరిగి ఇండియాకు పంపించేశాయి. ఈ అంశంలో కేంద్ర ప్రభుత్వం బాధితులకు అవసరమైన సాయం అందిస్తుందని ప్రభుత్వం తెలిపింది.

# ప్రజలే మిమ్మల్ని తిరస్కరించారు..పీకేకు సుప్రీం చురక

**న్యూఢిల్లీ : - ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీహార్ ఎన్నికల ఫలితాలను సవాల్ చేస్తూ జన్ సురాజ్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టి వేసింది. ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై హైకోర్టులోనే తేల్చుకోవాలని సూచించింది. విచారణ సందర్భంగా సీజేఐ సూర్యకాంత్ మాట్లాడుతూ.. 'మీ పార్టీకి ఎన్ని



ఓట్లు వచ్చాయి? ప్రజలు మిమ్మల్ని తిరస్కరించారు, మీరేమో న్యాయ వ్యవస్థను వేదికగా చేసుకొని ప్రచారం పొందాలని చూస్తున్నారు' అని అన్నారు. జన్ సురాజ్ సమస్య దేశ వ్యాప్త సమస్య కాదని.. కాబట్టి పాట్నా హైకోర్టులోనే ఈ విషయాన్ని తేల్చుకోవాలని కోర్టు సూచించింది.


# బంగ్లాదేశ్‌లో ఎన్నికలకు ముందు ఆందోళనలు..

## యూనస్ ఇంటి ముందు ఉద్యోగుల నిరసన



**న్యూఢిల్లీ : -ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బంగ్లాదేశ్‌లో మరో వారం రోజుల్లో ఎన్నికలు జరగబోతున్నాయి. అయితే, ఎన్నికలకు ముందు బంగ్లా రాజధాని ఢాకాలో మరోసారి ఆందోళనలు మిన్నంటాయి. బంగ్లాదేశ్ తాత్కాలిక దేశాధినేత ముహమ్మద్ యూనస్ ఇంటి వద్ద ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆందోళన చేశారు. తమకు వేతనాలు పెంచాలని, తొమ్మిదవ పే స్కేల్ అమలు చేయాలని కోరుతూ ఢాకాలోని యూనస్ అధికారిక నివాసం వద్ద ఆందోళన బాటపట్టారు. శుక్రవారం ఉదయం నుంచి వారు నిరసన ప్రదర్శన చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఎన్నికైతే మళ్లీ తమకు వేతనాల పెంపు ఉండదని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. అందుకే నిరసనలకు దిగారు. అయితే, ఆందోళనకారుల్ని అడ్డుకునేందుకు అక్కడి భద్రతా దళాలు ప్రయత్నించాయి. దీంతో అటు ఆందోళనకారులకు, ఇటు భద్రతా సిబ్బందికి మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ ఘర్షణల్లో 15 మంది వరకు గాయపడ్డట్లు తెలుస్తోంది. హై సెక్యూరిటీ ఉన్న యూనస్ ఇంటిలోపలికి చొచ్చుకెళ్లేందుకు నిరసనకారులు ప్రయత్నించారు. బారికేడ్లు తొలగించి, గేట్లు ఎక్కి మరీ ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో వారిని అడ్డుకునేందుకు పోలీసులు లాఠీచార్జి చేశారు. వాటర్ కెనాన్లు ప్రయోగించారు. అయినప్పటికీ ఆందోళనకారుల్ని అడ్డుకోలేకపోయారు. పైగా వీరు పోలీసులపై తిరుగబడ్డారు. ఇరువర్గాల తోపులాటతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ ఘటనల్లో 15 మంది గాయపడ్డారు. బంగ్లాదేశ్‌లో 2024లో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి.. అంటే 18 నెలలుగా బంగ్లాలో తాత్కాలిక ప్రభుత్వమే నడుస్తోంది. అందుకే కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు ఈనెల 12న దేశవ్యాప్తంగా ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలు ప్రశాంతంగా జరిపేందుకు యూనస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నామని చెబుతోంది. కానీ, ఆందోళనలు మాత్రం ఆగడం లేదు.

# యథాతథంగా వడ్డీ రేట్లు.. ఆర్బీఐ



**న్యూఢిల్లీ ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. ద్రవ్య పరపతి విధాన సమీక్షలో భాగంగా వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. రెపో రేటులో ఎలాంటి మార్పు చేయకుండా 5.25 శాతం వద్దనే కొనసాగిస్తున్నామని తెలిపారు. గతేడాది పలుమార్లు వడ్డీ రేట్లలో కోతలు విధించిన ఆర్‌బీఐ, ఈ సారి అలాగే ఉంచింది. దీనివల్ల హోమ్ లోన్, కార్ లోన్ వంటి రుణాల మీద వడ్డీ భారం పెరగదు. ఇది సామాన్యులకు పెద్ద ఊరట.

# గెలిపిస్తే ఎల్లవేళలా సేవ చేస్తా

## -- బిజెపి అభ్యర్థి అల్లాజీ గౌడ్



**ఆమనగల్లు, ఫిబ్రవరి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆమనగల్లు 12వ వార్డు బిజెపి అభ్యర్థి చుక్క అల్లాజీ గౌడ్ శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న ఆయనను మహిళలు, యువత, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో వెంట నడుస్తూ ప్రచారంలో పాల్గొన్నారు. ప్రజా సేవే తనకు ముఖ్యమని, ఎవరికి కష్టం వచ్చినా ఎల్లవేళలా వెన్నంటి ఉంటానని అల్లాజీ గౌడ్ హామీ ఇచ్చారు. వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దేందుకే ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని, కమలం పువ్వు గుర్తుపై ఓటేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రతి ఇంటికి తాగునీరు అందించడం, అన్ని కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం, వీధిలైట్ల ఏర్పాటు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతానని ఆయన హామీ ఇచ్చారు. బిజెపి అభ్యర్థిని గెలిపించి వార్డును అభివృద్ధి పథంలో నడిపించాలని అల్లాజీ గౌడ్ ఓటర్లను విజ్ఞప్తి చేశారు.